సాక్షి సూర్యాపేట

బుధవారం । 20 । నవంబర్ । 2024



సాగర్‌లో మరిన్ని హంగులు

నాగార్జునసాగర్‌ను రూ.100 కోట్లతో మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. - 8లో



విద్యార్థికి పాముకాటు

కేతేపల్లి మండలం మూసీ బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి పాము కాటుకు గురయ్యాడు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	: 584.60 అడుగులు
ఇన్‌ఫ్లో	:17.567 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:17.567 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా : నిల్	
కుడికాల్వ ద్వారా	: 9.500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5.367 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2.400
వరద కాల్వకు	: 300

న్యూస్‌రీల్

వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి

భానుపురి (సూర్యాపేట) : వికలాగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చింత సతీష్ కోరారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు వికలాంగుల పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. 2016 దివ్యాంగుల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డీ. జహీర్ బాబా, ఉపాధ్యక్షుడు చింత సాంబయ్య, కార్యదర్శి మిద్దె సైదులు, సీనియర్ నాయకులు ఉప్పునూతల నరసయ్య, ఎలగందుల కృష్ణమూర్తి, జానయ్య పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా చూడాలి



అనంతారంలో బహిరంగ మల విసర్జనపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ నారాయణరెడ్డి

పెన్‌పహాడ్: పల్లెల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా చూడాలని డీపీఓ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం, నాగులపహాడ్ గ్రామ పంచాయతీలను తనిఖీ చేశారు.నాగులపహాడ్ గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. అనంతారం గ్రామంలో ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. బహిరంగ మల విసర్జన చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంజీవయ్య, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి రాజు, పంచాయతీ కార్యదర్శి దివ్యభారతి, ఫీల్డ్ అసిస్టెంట్ బేగం తదితరులు పాల్గొన్నారు.

మా దుకాణాలను తొలగించొద్దు



దుకాణాల వద్ద బైఠాయించిన బాధితులు

హుజూర్‌నగర్ : కొన్నేళ్లుగా చేతి వృత్తులు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నామని తమ దుకాణాలను తొలగించవద్దని బాధితులు మున్సిపల్ అధికారులను వేడుకున్నారు. మంగళవారం హుజూర్ నగర్‌లోని పీర్లకొట్టం సెంటర్లో కటింగ్ , ఇస్త్రీ షాపులను మున్సిపల్ అధికారులు జేసీబీతో తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో ఆయా షాపుల వారు వచ్చి తమ షాపులను కూల్చొద్దని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. అధికారులు కొందరికి వత్తాసు పలుకుతూ తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని వారు ఆరోపించారు. ఉన్నతాధికారులు కల్పించుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు ఇందిరాల రాంబాబు , పిన్నెల్లి కోటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

29 నుంచి సీపీఎం మహాసభలు



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

భానుపురి (సూర్యాపేట) : ఈనెల 29, 30, డిసెంబర్ 1 తేదీల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా తృతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి తెలిపారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కేంద్ర కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ మహాసభల సందర్భంగా 29వ తేదీన గాంధీపార్క్‌లో నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని కోరారు. రానున్న కాలం కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. ప్రపంచంలో దోపిడీ, పీడన, వివక్ష, అణిచివేత ఉన్నంత కాలం కమ్యూనిజం అజేయంగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి, నాయకులు దండా వెంకటరెడ్డి, ఎల్గూరి గోవింద్, వేల్పుల వెంకన్న, నరసింహారావు, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కొప్పుల రజిత, జ్యోతి పాల్గొన్నారు.

సర్వేకు ఆపసోపాలు

సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్ల పాట్లు

- ఉదయం విధులు ముగించుకొని మధ్యాహ్నం సర్వేకు..
- వ్యవసాయ, ఇతర పనులకు జనం వెళ్లడంతో ఆ సమయంలో చాలా ఇళ్లకు తాళాలు
- ఒక్కో ఇంటికి రెండుమూడు సార్లు తిరగాల్సిన పరిస్థితి
- ఒకవేళ ఉన్నా.. పూర్తి వివరాలు చెప్పేందుకు ఆసక్తిచూపని ప్రజలు
- జిల్లాలో 72.8 శాతం సర్వే పూర్తి



హుజూర్‌నగర్‌లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

జిల్లాలో సర్వే చేయాల్సిన ఇళ్లు	సర్వే పూర్తయిన ఇళ్లు
3,69,557	2,69,066
ఎన్యుమరేటర్లు	సూపర్‌వైజర్లు
2646 మంది	271 మంది



భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో వివరాల సేకరణకు ఎన్యుమరేటర్లు ఆపసోపాలు పాడాల్సివస్తోంది. మొత్తం 75 ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి ఫారంలో నింపాల్సి ఉంది. కానీ, తమకు అందుతున్న పథకాలు ఎక్కడ రద్దవుతాయోనన్న అనుమానంతో జనం సరైన సమాధానాలు చెప్పడం లేదు. దీనికితోడు ఎన్యుమరేటర్లు సర్వేకు మధ్యాహ్నం వెళ్తుండడంతో అప్పటికే ప్రజలు వ్యవసాయ, ఇతర పనులకు పోవడంతో ఇళ్లకు తాళాలు ఉంటున్నాయి. దీంతో ఒక్కో ఇంటికి రెండు, మూడుసార్లు తిరగాల్సి వస్తోందని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు.

మీకెందుకు వివరాలివ్వాలి..

సర్వేలో మొత్తం 75 అంశాలపై వివరాలు సేకరించాల్సి ఉంది. ఇలా ఒక్కో కుటుంబానికి దాదాపు గంట సమయం పడుతుందని ఎన్యుమరేటర్లు ఆవేదన చెందుతున్నారు. చాలా గ్రామాల్లో ప్రజలు ఎన్యుమరేటర్లను నిలదీస్తున్నారు. 'మాకేమైనా పథకాలు ఇస్తారా... మీకెందుకు వివరాలు చెప్పాలని' ఎదురు ప్రశ్నిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, కార్లు కనిపిస్తున్నా.. అవి తమవి కాదంటూ దాటవేస్తున్నారు. ఇలా చాలా చోట్ల సర్వే సాఫీగా సాగని పరిస్థితి నెలకొంది. 51వ కాలంలో స్థిరాస్తుల వివరాలు చెప్పడం లేదు. 52వ కాలంలో టీవీ, రిఫ్రిజిరేటర్, ద్విచక్ర వాహనం, కారు, వాషింగ్ మిషన్ తదితర వివరాలను వెల్లడించేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. కొన్నిచోట్ల కులం తెలిపే క్రమంలో ఉపకులాలు చెప్పడం లేదని ఎన్యుమరేటర్లు అంటున్నారు. కొన్నిచోట్ల సొంతింట్లో ఉంటున్నా.. అద్దెఇల్లు అని సర్వేలో రాయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులకు మోక్షం లేదని, సర్వేలో సమాధానాలు ఎందుకు చెప్పాలని నిలదీస్తున్నారు.

27వరకు పూర్తయ్యేనా?

ఈనెల 8వ తేదీన ప్రభుత్వం సమగ్ర సర్వే ప్రారంభించింది. దీన్ని ఈనెల 27వ తేదీ వరకు పూర్తి చేయాలని గడువు విధించింది. అయితే జిల్లాలో 3,69,557 ఇళ్లు ఉన్నట్లు ఎన్యుమరేటర్లు గుర్తించారు. ఇందులో ఈనెల 18వ తేదీ నాటికి 2,69,066 ఇళ్లను సర్వే చేశారు. అంటే 72.8 శాతం సర్వే పూర్తయింది. జిల్లావ్యాప్తంగా అర్బన్ ప్రాంతాల్లో 69.4 శాతం, రూరల్ ప్రాంతాల్లో 73.9 శాతం చొప్పున ప్రజల ఇళ్లకు వెళ్లి సిబ్బంది వివరాలు సేకరించారు. మరో వారం రోజుల్లో ఈ సర్వేను పూర్తి చేయాల్సి ఉండగా.. ఎన్యుమరేటర్ల ఇబ్బందుల కారణంగా సర్వే పూర్తవుతుందా ? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా అపూర్వ రవళి



అదనపు జూనియర్ సివిల్‌జడ్జికి పూలబొకే ఇచ్చి స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నుగూరి అపూర్వ రవళి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మిర్యాలగూడ కోర్టు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జె.ప్రశాంతి బదిలీపై హైదరాబాద్‌లోని మల్కాజిగిరి కోర్టుకు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తికి బార్ అసోసియేషన్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, న్యాయవాదులు ఎస్. రామరాజు, దండ వెంకట్ రెడ్డి, పెండెం వాణి, ఎండీ అబ్దుల్ లతీఫ్, ధరావతు వీరేష్ నాయక్ , అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.హేమలత, సీఐలు వై.సురేందర్ రెడ్డి, రాజశేఖర్, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రతీ రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



కామేశ్వరమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, నాయకులు

పాలకవీడు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనతి కాలంలో ప్రతీ రంగంలో విఫలం చెందిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పాలకవీడు మండల పార్టీ అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి మాతృమూర్తి కామేశ్వరమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో అంజిరెడ్డి కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కామేశ్వరమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్య, వైద్య, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. అవగాహన రాహిత్యంతో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని వందశాతం అభివృద్ధి పరిచింది తమ అనాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రాజెక్టులపై కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో రైతులు ఆర్థికంగా పురోగమించారని, కాంగ్రెస్ పాలనలో అప్పుల్లో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ కాలేదు, రైతు భరోసా సాయం అందక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇవే చివరి ఎన్నికలు, చివరి గెలుపని పేర్కొన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తప్పు చేశామని ప్రజలు మనోవేదన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఒంటెద్దు నరసింహారెడ్డి, జిల్లా నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల సైదిరెడ్డి, కడియం వెంకట్ రెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, అరిబండి బాబు, దొండపాటి అప్పిరెడ్డి, జయబాబు, పచ్చిపాల ఉపేందర్, బెల్లంకొండ అమర్, చెన్నబోయిన సైదులు, రాపోలు నవీన్, పసుపులేటి సైదులు, లక్ష్మారెడ్డి, జాన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

- ఇందిరాగాంధీకి నివాళి



ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం హుజూర్‌నగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, పార్టీ నేతలు - హుజూర్‌నగర్

దరఖాస్తుల ఆహ్వానం

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కోర్టులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. స్టెనో, టైపిస్ట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు (suryapet.dcourts.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు. డిసెంబర్ 2వతేదీ సాయంత్రం 5 గంటల లోపు రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు పంపించాలని సూచించారు.

పక్కాగా చెత్తసేకరణ

మున్సిపాలిటీల్లో చెత్తసేకరణ వాహనాలకు జీపీఎస్

- ఒక్కో పరికరానికి రూ.6వేలు ఖర్చు
- వాహనాల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం
- కేటాయించిన రూట్లో పారిశుద్ధ్య సిబ్బంది వెళ్తున్నారా లేదా కనిపెట్టడానికి దోహదం



హుజూర్‌నగర్‌లో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీల పరిధిలో చెత్త సేకరణపై నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని అరికట్టేందుకు సూక్ష్మంగా పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా చెత్త సేకరణ వాహనాలైన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు, టిప్పర్లకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) ఏర్పాటు చేస్తున్నారు. దీనికి టెండర్లు పూర్తి చేసి జీపీఎస్ పరికరాలు కూడా బిగించారు. దీంతో మున్సిపాలిటీల్లో వాహనాలు ఎక్కడ తిరిగి చెత్తను సేకరిస్తున్నాయో అధికారులకు స్పష్టంగా తెలుస్తుంది.

మున్సిపాలిటీ	జీపీఎస్ బిగించిన వాహనాలు
సూర్యాపేట	52
కోదాడ	22
హుజూర్‌నగర్	15
తిరుమలగిరి	10
నేరేడుచర్ల	08

107 వాహనాలకు..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల ఉన్నాయి. వాటిలో మొత్తం 107 వాహనాలకు మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిలో సూర్యాపేటలో చెత్త సేకరించే 40 ఆటో ట్రాలీలు, 12 ట్రాక్టర్లు, కోదాడలో 18 ఆటో ట్రాలీలు, 4 ట్రాక్టర్లకు జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్‌లో 9 ఆటో ట్రాలీలు, 4 ట్రాక్టర్లు, 2 వాటర్‌సప్‌లై ట్యాంకర్లు, తిరుమలగిరిలో 8 ఆటో ట్రాలీలు, రెండు ట్రాక్టర్లు, నేరేడుచర్లలో 5 ఆటో ట్రాలీలు, 2 ట్రాక్టర్లు, 1 వైకుంఠధామం వాహనానికి జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణలో టెక్నికల్ సిబ్బంది ఆయా వాహనాలకు పరికరాలు బిగించారు. మున్సిపల్ ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్, శానిటరీ అధికారులతో పాటు ఇతర అధికారులు కూడా ఆయా వాహనాలు ఎక్కడ ఉన్నాయో ఎటు తిరుగుతున్నాయో సెల్‌ఫోన్‌లో స్పష్టంగా తెలుసుకోవచ్చు. పారిశుద్ధ్య సిబ్బంది తమకు కేటాయించిన రూట్లో వెళ్తున్నారా? ఎక్కడైనా వాహనాలు నిలిపి ఉంచారా? ఎన్ని ట్రిప్పులు చెత్త సేకరించారు? తదితర విషయాలు జీపీఎస్ ద్వారా తెలిసిపోతాయి.

ప్రైవేట్ సంస్థకు జీపీఎస్ పరికరాల బిగింపు బాధ్యతలు

జీపీఎస్ పరికరాల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. వాటి బిగింపు బాధ్యతలను ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఒక్క జీపీఎస్ పరికరానికి రూ. 6 వేలకు పైగానే చెల్లిస్తున్నారు. పరికరాల బిగింపు సమయంలో 25 శాతం, బిగించిన తర్వాత 25 శాతం, ఏడాది తర్వాత 25 శాతం, రెండేళ్లకు 25 శాతం చొప్పున చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

తొలగించినవారిపై చర్యలు..

గతంలో జీపీఎస్ పరికరాలు బిగిస్తే కొందరు వాటిని తొలగించారనే ఆరోపణలు ఉన్నాయి. వాటిని పని చేయకుండా చేశారనే విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రైవేటు సంస్థ పర్యవేక్షణ ఉండటంతో వెంటనే మరమ్మతులు చేస్తారు. డ్రైవర్లు ఎవరైనా వాటిని పాడుచేసినా వాటిని తొలగించినా కఠిన చర్యలు ఉంటాయి.

తనిఖీ చేసే సమయం ఆదా అవుతుంది



మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాలపై సూక్ష్మస్థాయి పరిశీలనకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటు చేశాం. దీంతో వాహనాలు తనిఖీ చేసే సమయం ఆదా అవుతుంది. జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల పనిలో పారదర్శకత పెరుగుతుంది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు తగ్గుతాయి. చెత్త సేకరణ కూడా పక్కాగా జరుగుతుంది.

– కె. శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

ఆయిల్‌పామ్ సాగుచేసి లాభాలు పొందండి

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



ఆయిల్‌పామ్ సాగుపై ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చివ్వెంల(సూర్యాపేట) : రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని బ్రాహ్మణ సదన్ కల్యాణ మండపంలో ఉద్యానవన శాఖ, పతంజలి ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్‌సాగుపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు నీటి వసతి ఉంటే వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి తీగల నాగయ్య, సుబ్బారావు, పతంజలి డీజీఎం బి. యాదగిరి, అధికారులు మహేష్, కట్టస్వాతి, ప్రమిత, పతంజలి మేనేజర్ హరీష్, జూనియర్ మేనేజర్ శశికుమార్, వెంకట్, అశోక్, సిబ్బంది రంగు ముత్యంరాజు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలి

మునగాల: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. మంగళవారం మునగాల మండలం మాధవరం శివారులో పతంజలి కంపెనీ ఆధ్వర్యంలో పెంచుతున్న ఆయిల్‌పామ్ నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీకి ఇతర దేశాల నుంచి వచ్చే మొక్కల వివరాలను కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుతో అధికలాభాలు పొందవచ్చన్నారు. రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలు అందించాలన్నారు. నర్సరీలో నాణ్యత లేని మొక్కలను గుర్తించి వెంటనే కాల్చివేయాలన్నారు. రైతులకు నాణ్యమైన , ఆరోగ్యకరమైన మొక్కలు సరఫరా చేస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. మొక్కల పెంపకంలో అలసత్వం వహించవద్దని కంపెనీ ప్రతినిధులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి తీగల నాగయ్య, సాంకేతిక ఉద్యానవన అధికారి మహేష్, పతంజలి డీజీఎం బి.యాదగిరి, మేనేజర్ జె.హరీష్, నర్సరీ అధికారి స్రవంతి పాల్గొన్నారు.

ప్రజలను భాగస్వాములు చేయాలి

భానుపురి(సూర్యాపేట) : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఈనెల 19 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మరుగుదొడ్ల వారోత్సవాల కరపత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చేనెల 5వ తేదీ వరకు వ్యక్తిగత మరుగుదొడ్లకు రంగులు వేయించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించేలా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ అప్పారావు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, డీపీఓ నారాయణరెడ్డి, డీఈఓ అశోక్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సూర్యాపేట టౌన్: రోజూ క్రీడలు ఆడటం వల్ల మానసికోల్లాసం కలుగుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టును ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటలు ఆడితే ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడానికి సమయం దొరికితే ఆటలపై దృష్టి పెట్టాలని కోరారు. క్రీడా కోర్టును తయారు చేయడంలో బాగా పని చేసిన, సమన్వయం చేసిన పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, డీఎస్పీ రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై పనిభారం తగ్గించాలి

భానుపురి (సూర్యాపేట) : ఆర్టీసీ కార్మికులపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం.రాంబాబు, నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట ఆర్టీసీ డిపో గేటు ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చి నేటికీ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు ఏకలక్ష్మి, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, డిపో అధ్యక్షుడు గుండు రమేష్, నాయకులు శ్రీనివాస్, వీరస్వామి, ప్రసాద్, మల్లయ్య, నాగార్జున, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, నాయకులు

క్రీడలతో దివ్యాంగుల్లో మనోధైర్యం



పరుగుపందెంలో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : క్రీడలతో దివ్యాంగుల్లో మనోధైర్యం పెరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి కె.నర్సింహారావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడటం ద్వారా దివ్యాంగుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. దివ్యాంగులు క్యారం బోర్డ్, చెస్, పరుగు పందెం, షార్ట్ పుట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి డిసెంబర్ 3న జరిగే జిల్లా స్థాయి కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు, కార్యాలయ సిబ్బంది, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

క్లుప్తంగా

బావిలో పడి మహిళ మృతి

చివ్వెంల(సూర్యాపేట): వరి కొయ్యలు కాల్చుతుండగా.. ఒక్కసారిగా పొగ రావడంతో భయంతో వెనుకకు జరిగిన మహిళ బావిలో పడి మృతిచెందింది. ఈ ఘటన చివ్వెంల మండలం ఐలాపురం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐలాపురం గ్రామానికి చెందిన కూసునోజు బాలకృష్ణ, అతని భార్య లావణ్య(32) కలిసి గ్రామ శివారులోని తమ వ్యవసాయ పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్లారు. వరి కొయ్యలు కాల్చుతున్న క్రమంలో ఒక్కసారిగా పొగ రావడంతో లావణ్య భయపడి వెనుకకు జరగుతూ బావిలో పడిపోయింది. ఇది గమనించిన బాలకృష్ణ పక్కనే ఉన్న రైతులను పిలుచుకుని వచ్చే లోపు ఆమె మృతిచెందింది. బావిలో నీరు ఉండటంతో లావణ్యకు ఈత రాక అందులో మునిగి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మహేశ్వర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ టౌన్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఆటోను ఢీకొని తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నందివాడ మండలం అరిపిరాల గ్రామానికి చెందిన గోగులముడి తంబి(40) కొంత కాలంగా నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో వెల్డింగ్ పనిచేస్తూ రాశి సిమెంట్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 18వ తేదీన బైక్‌పై మిర్యాలగూడ పట్టణానికి వస్తుండగా.. మార్గమధ్యలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై మిర్యాలగూడ మండలం గూడూరు వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాలీ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తంబిని స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

భువనగిరి క్రైం: ముళ్ల పొదల్లో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం భువనగిరి పట్టణంలోని నల్లగొండ రోడ్డులో గల నయార పెట్రోల్ బంక్ వద్ద వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నయార పెట్రోల్ బంక్ వెనుక ముళ్ల పొదల్లో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన శంషె ఆలం(22)గా గుర్తించారు. మృతుడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కనే గల కరీముల్లా లారీ మెకానిక్ షెడ్డులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి రూంలో నుంచి వెళ్లి తిరిగిరాలేదని అతడి తోటి మెకానిక్ జమీల్ అక్తర్ పోలీసులకు వివరించాడు. మృతుడి నుదిటిపై బలమైన గాయాలు ఉండగా వేరే దగ్గర చంపి ఇక్కడకు తీసుకొచ్చి ముళ్లపొదల్లో పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

సాగర్‌లో మరిన్ని హంగులు

రూ.100 కోట్లతో పర్యాటక అభివృద్ధికి ప్రణాళిక

- స్వదేశీ దర్శన్ స్కీం కింద నిధులు మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు
- బుద్ధవనంలో డిజిటల్ మ్యూజియం, బౌద్ధ విశ్వవిద్యాలయం..
- చాకలికొండలో, వైజాగ్ కాలనీ వద్ద కాటేజీల ఏర్పాటుకు సన్నాహాలు
- స్టార్ హోటల్స్‌తో పాటు వాటర్ గేమ్స్, స్పీడ్ బోట్లు నడిపించాలని నిర్ణయం



నాగార్జునసాగర్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన, బౌద్ధం పరిఢవిల్లిన నాగార్జునసాగర్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. రూ.100కోట్లతో నాగార్జున సాగర్‌తో పాటు పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సాగర్‌లో అనువైన చోట స్టార్ హోటల్స్, కాటేజీలు, జలాశయంలో వాటర్ గేమ్స్, స్పీడ్ బోట్స్ నడిపేందుకు సన్నాహాలు చేస్తోంది.

▶ చాకలికొండపై కాటేజీలు

విదేశీ పర్యాటకులు ప్రశాంతంగా గడిపేందుకు సాగర్ జలాశయం మధ్యలో 500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న చాకలికొండలో కొంతభాగాన్ని తీసుకుని అటవీశాఖతో కలిసి ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏకో టూరిజం అభివృద్ధి చేసేందుకు అంచనాలు సిద్ధమయ్యాయి. ఇక్కడ కాటేజీలు నిర్మించనున్నారు. ఇందుకు గాను మూడు కన్సల్టెన్సీ ఏజెన్సీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాటేజీల ఏర్పాటుకు అవసరమయ్యే నిధుల అంచనాలను ఏజెన్సీలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాయి. ఈ డీపీఆర్‌ల ఆధారంగా స్వదేశీ దర్శన్ 2.0 నిధులు మంజూరు చేయాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది.

▶ పర్యాటకుల కోసం స్టార్ హోటల్స్



స్టార్ హోటల్స్ నిర్మించనున్న స్థలం

ప్రతి ఏడాది విదేశీ పర్యాటకులు వేల సంఖ్యలోనే నాగార్జునసాగర్‌కు వస్తుంటారు. వారు బస చేసేందుకు తగిన హోటల్స్ లేవు. జలాశయం తీరాన ప్రైవేట్ భాగస్వామ్యంతో స్టార్ హోటల్స్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సిద్ధమైంది. అంతే కాకుండా శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు కమలేష్ డీ పటేల్(దాదాజీ) ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సాగర్‌కు వచ్చినపుడు ఆయన వెంట బుద్ధవనం, విపస్సన ప్రాంతాలను సందర్శించారు. ఇక్కడ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేసేందుకు భూమి పరిశీలించారు.

▶ బుద్ధవనంలో డిజిటల్ మ్యూజియం



బుద్ధవనం

274 ఎకరాల్లో నిర్మాణమవుతున్న బుద్ధవనంలో డిజిటల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్నారు. బుద్ధుని చరిత్ర అందరికీ అర్థమయ్యే రీతిలో 2,500 చిత్రాలతో డిజిటల్ మ్యూజియం ఏర్పాటుకు రూ.25కోట్లు ఖర్చు చేయనున్నారు. దీనితో పాటు బౌద్ధ విశ్వవిద్యాలయం, గ్రంథాలయం, రీసెర్చ్ స్కాలర్స్ బస చేసేందుకు గదులు నిర్మించనున్నారు.

▶ వైజాగ్ కాలనీ సమీపంలో వాటర్ గేమ్స్

సాగర్ బ్యాక్‌వాటర్‌లో వాటర్ గేమ్స్, స్పీడ్ బోట్లతో పాటు వైజాగ్ కాలనీ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు కాటేజీలనిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపితే నాగార్జునసాగర్‌తో పాటు జలాశయతీర ప్రాంతం అభివృద్ధి చెందనుంది.



వైజాగ్ కాలనీ వ్యూ

బోరు మోటార్లు, కరెంట్ వైర్లు చోరీ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని పిలాయిపల్లి గ్రామంలోని తాళ్లచెరువు ఆయకట్టు కింద ఉన్న పలువురి రైతుల వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, కరెంట్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. వరికోతలు పూర్తవ్వడంతో నెల రోజులుగా రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లలేదు. తిరిగి దున్నకాలు ప్రారంభం కావడంతో మంగళవారం రైతులు తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి చూడగా బోరు మోటార్లు, కరెంట్ వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. పెద్దగూడేనికి చెందిన కన్నెమోని దానయ్యకు చెందిన 2 బోరు మోటార్లతో పాటు పిలాయిపల్లి గ్రామానికి చెందిన గ్యార నర్సింహ, గ్యార బాలయ్య, మాడ్గుల గోవర్ధన్‌రెడ్డి, పాండాల రాములుకు చెందిన మొత్తం 6 మోటార్లను దుండగులు ఎత్తుకెళ్లారు. అంతేకాక సుమారు 50 మోటార్లకు సంబంధించిన వైరును సైతం దొంగిలించారు. చోరీకి గురైన మోటార్లు, వైర్ల విలువ సుమారు రూ.2.80 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. వారం క్రితం కూడా పిలాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన బోరు మోటార్లు చోరీకి గురైనట్లు తెలిసింది. మంగళవారం పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. అనంతరం గ్రామ పరిధిలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బోరు మోటారు ఎత్తుకెళ్లడంతో మిగిలిన పైపు

ఆటోమొబైల్ షాపులో అగ్ని ప్రమాదం

- రూ.50లక్షల ఆస్తి నష్టం

చిట్యాల: షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఆటోమొబైల్ షాపు దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం రాత్రి చిట్యాల మండల కేంద్రంలో జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని ఆటోనగర్‌లో శ్రీకాంత్ అనే వ్యక్తి మల్లికార్జున ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో షాపులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న నిద్రిస్తున్న పలువురు మెకానిక్‌లు షాపు యజమానితో పాటు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ షాపులోని సామాను పూర్తిగా కాలిబూడిదైంది. సుమారు రూ.50లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు షాపు యజమాని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆటోమొబైల్ షాపులో ఎగసిపడుతున్న మంటలు

పట్టపగలు రెండిళ్లలో చోరీ

- రూ.2లక్షల నగదు, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

దేవరకొండ: పట్టపగలు రెండిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని జైపాల్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్న రమావత్ రాజు భార్య హైదరాబాద్‌కు వెళ్లగా.. రాజు రోజువారి పని మీద బయటకు వెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న రాజు తల్లి దేవలి మధ్యాహ్నం పిల్లలకు లంచ్ బాక్స్ ఇచ్చేందుకు ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లింది. దారిలో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన కుమారుడికి సమాచారం ఇచ్చింది. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.1.57లక్షల నగదు, తులంన్నర బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. అదేవిధంగా దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నివాసముంటున్న నేనావత్ శ్రీను, అతడి భార్య పని నిమిత్తం మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లారు. వారి కుమారుడు సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. ఇంట్లోని బీరువాలో ఉంచిన రూ.50వేల నగదుతో పాటు బంగారం చోరీ అయినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



నర్సింహ (ఫైల్)

రామన్నపేట: పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రామన్నపేట మండలం వెల్లంకి గ్రామ శివారులో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం(తుమ్మలగూడెం) గ్రామానికి చెందిన పెద్దగోని నర్సింహ(54) ట్రాక్టర్‌తో రైతుల పొలాలు దున్నుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గ్రామానికి చెందిన కాటిపల్లి మహేష్ వెల్లంకి గ్రామ శివారులో కౌలుకు చేస్తున్న పొలాన్ని మంగళవారం నర్సింహ ట్రాక్టర్‌తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు తిరగబడింది. నర్సింహ ట్రాక్టర్ ఇంజన్, కల్టివేటర్ మధ్య ఇరుక్కోవడంతో తలకు స్టీరింగ్ బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు. మృతదేహాను పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శాలిగౌరారం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శాలిగౌరారం, అడ్లూరు గ్రామాల శివారులో సోమవారం రాత్రి జరిగింది. శాలిగౌరారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సురేశ్, సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి సోమవారం రాత్రిలు విధులు ముగించుకొని బైక్‌పై నకిరేకల్‌కు వెళ్తున్నారు. అదే సమయంలో ఊట్కూరు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ శీలం కృష్ణ నకిరేకల్ నుంచి శాలిగౌరారం వైపు బైక్‌పై వస్తూ శాలిగౌరారం, అడ్లూరు గ్రామాల శివారులో అదుపుతప్పి సురేశ్, వెంకట్‌రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేశ్ చెయ్యి విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణకు కూడా గాయాలు కాగా వెంకట్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సురేశ్, కృష్ణను 108 వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని..

నడిగూడెం: మండల కేంద్రానికి చెందిన దున్నా మధు మంగళవారం రాత్రి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం నుంచి నడిగూడేనికి వస్తుండగా వీరాంజనేయనగర్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధు గాయాలు కాగా.. స్థానికులు 108 వాహనంలో సూర్యాపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నల్లగొండ క్రైం: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని నీలగిరి కాలనీలో మంగళవారం జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. కనగల్ మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన బైరోజు పూర్ణచంద్రచారి(40) నల్లగొండ పట్టణంలోని నీలగిరి కాలనీలో కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అతడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో మంగళవారం పూర్ణచంద్రచారి తాను ఉంటున్న అద్దె ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సైదులు తెలిపారు.

ఇద్దరు రేషన్ డీలర్లపై కేసు నమోదు



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

చిలుకూరు: అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన ఇద్దరు రేషన్ డీలర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన రేషన్ డీలర్లు ఓరుగంటి లక్ష్మీనరసింహారావు, గిజ్జి సువర్ణ రేషన్ లబ్ధిదారుల వద్ద నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి వారి ఇళ్లలో నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం చిలుకూరు పోలీసులు తనిఖీలు నిర్వహించి నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వడంతో కోదాడ సివిల్ సప్లై ఆర్‌ఐ కృష్ణారెడ్డి పంచనామా చేశారు. లక్ష్మీనరసింహారావు ఇంట్లో 60 బస్తాల్లో 30 క్వింటాళ్లు, సువర్ణ ఇంట్లో 32 బస్తాల్లో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికినట్లు ఆర్‌ఐ తెలిపారు. దొరికిన రేషన్ బియ్యాన్ని గ్రామంలోని మరో రేషన్ డీలరుకు అప్పగించినట్లు పేర్కొన్నారు. సివిల్ సప్లై ఆర్‌ఐ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఇద్దరు రేషన్ డీలర్లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన మెడికల్ విద్యార్థులపై కేసు

నల్లగొండ క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్లను ర్యాగింగ్ చేసిన ఐదుగురు సీనియర్ విద్యార్థులపై సోమవారం రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2020 బ్యాచ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు, 2019 బ్యాచ్‌కు చెందిన ఒక విద్యార్థిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లను గోడ కుర్చీ వేయించినట్లు యాంటి ర్యాగింగ్ కమిటీ విచారణలో తేలడంతో వైస్ ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు..

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నరాఉ. మెడికల్ కాలేజీలో జూనియర్లపై సీనియర్లు ర్యాగింగ్ చేస్తూ భౌతిక దాడికి పాల్పడ్డాడని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు. కళాశాలలో ర్యాగింగ్ జరిగితే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

పాము కాటుకు గురైన గురుకుల విద్యార్థి

- నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేష్

కేతేపల్లి: గురుకుల పాఠశాల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థి పాము కాటుకు గురయ్యాడు. ఈ ఘటన కేతేపల్లి మండలం మూసీ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం సాయంత్రం జరిగింది. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన బద్దం చంద్రశేఖర్, అనిత దంపతుల కుమారుడు గణేష్ కేతేపల్లి మండలం మూసీ ప్రాజెక్టు వద్ద గల జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ పాఠశాల వసతి గృహంలో ఉంటున్నాడు.. మంగళవారం సాయంత్రం గణేష్ కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు వసతి గృహం సమీపంలో ఉన్న మరుగుదొడ్ల వద్దకు వెళ్లగా పాము కాటు వేసింది. దీంతో తోటి విద్యార్థులు కేకలు వేస్తూ పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మకు విషయం తెలియజేశారు. వెంటనే గణేష్ తల్లిదండ్రులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం అతడిని నకిరేకల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గణేష్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేతేపల్లి ఎంఈఓ ఆకవరం రాజేంద్రప్రసాద్ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశారు.

భువనగిరి ఆస్పత్రి ఎదుట వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట బస్టాప్ వద్ద మంగళవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద లభించిన ఐడీ కార్డులో మరిచెట్టి నాగేంద్ర గణేశ్, వయస్సు 38 సంవత్సరాలు, ఇంటి నం. 17–3–1/7/1/అ, జవహర్‌పురా, యాకుత్‌పురా, చార్మినార్, హైదరాబాద్ అని ఉంది. మృతుడు ఈ నెల 13వ తేదీన ప్రమాదవశాత్తు రైలులో నుంచి కింద పడిపోగా రైల్వే పోలీసులు భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అతడిని డాక్టర్ పరిశీలించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు రిఫర్ చేయగా అతడు హాస్పిటల్ నుంచి బయటకు వచ్చి చుట్టుపక్కల తిరుగుతూ మృతిచెందినట్లు తెలిసింది. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. మృతుడి వివరాలకు 8712579973, 8712662803 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అమృత్.. ఆలస్యం!

- నత్తనడకన సాగుతున్న అమృత్ పథకం పనులు
- ఎక్కడా పూర్తికాని ట్యాంక్ నిర్మాణాలు
- సాంకేతిక సమస్యలు, కూలీల కొరత కారణంగా ఆలస్యం

సాక్షి, యాదాద్రి: ప్రజలకు మంచినీటి ఎద్దడి తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణాలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో ఆయా పనులకు రూ.121.3 కోట్ల నిధులు మంజూరు చేసింది. కానీ ఆయా మున్సిపాలిటీల్లో పనులు ప్రారంభించినా ఎక్కడా పూర్తయిన దాఖలాలు లేవు. చాలాచోట్ల సాంకేతిక సమస్యలు, కూలీల కొరత, రాజకీయ వివాదాల కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. ఐదు నెలల్లోగా పనులు పూర్తిచేయాల్సి ఉన్నా ఇంకా ఆలస్యమయ్యేలా ఉన్నాయి. దీంతో అమృత్ పథకం లక్ష్యం ఇప్పట్లో నెరవేరేలా లేదు.

మున్సిపాలిటీల వారీగా పనులు ఇలా..

- భువనగిరి మున్సిపాలిటీలో అమృత్ 2.0 పథకం కింద రూ.21.8 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతి నగర్‌లో రూ.15 లక్షల కిలోలీటర్ల ట్యాంకు, సింగన్నగూడెంలో 10 లక్షల లీటర్ల ట్యాంక్, రాయిగిరిలో 3లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మించాల్సి ఉంది. ప్రగతినగర్‌లో నిర్మిస్తున్న ట్యాంకు పనులు సాగుతుండగా, సింగన్నగూడెం రాయిగిరిలో ప్రతిపాదించిన ట్యాంకులకు డిజైన్లు రాకపోవడంతో ఇంకా ప్రారంభించలేదు.



మోత్కూరు జూనియర్ కాలేజీ ఆవరణలో నిలిచిపోయిన ట్యాంక్ నిర్మాణం

- యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి రూ.38 కోట్లు మంజూరయ్యాయి. పైపులైన్ పనులతోపాటు గణేష్‌నగర్‌లో 1,200 కే.ఎల్, అంగడి బజారు దగ్గర 500 కేఎల్, గుండ్లపల్లిలోని నల్లాలబావి వద్ద 500 కిలోలీటర్ల ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభించారు. గణేష్ నగర్‌లో స్థలం చూసినప్పటికీ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.
- ఆలేరు మున్సిపాలిటీకి రూ.12 కోట్లు మంజూరయ్యాయి. అయితే ఆలేరు మున్సిపాలిటీని రెండు జోన్లుగా విభజించారు. జోన్–1 రైల్వే ట్రాక్ ఉత్తర దిశలో నూతనంగా 7 లక్షల లీటర్లు, జోన్–2 రైల్వే దక్షిణ దిశలో నూతనంగా పది లక్షల లీటర్ల సామర్థ్యంతో ఈఎల్ఎస్ఆర్ ప్రతిపాదించారు. వీటి నిర్మాణానికి రూ.2.97 కోట్లు కేటాయించారు. సాంకేతిక సమస్యలతో పనులు నిలిచిపోయాయి. డిజైన్ మార్చాలని నిర్ణయించడంతో ఆలస్యం అవుతోంది. పైపులైన్ నిర్మాణ పనులకు రూ.1.63 కోట్లు, మరో ఏడు రకాల పనులకు రూ.3.75 కోట్లు కేటాయించారు.
- భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీలో వెంకటరమణ కాలనీ ఏడో వార్డులో రూ.17.50 కోట్ల వ్యయంతో 5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్, పైపులైన్ పనులు ప్రతిపాదించారు. సెప్టెంబర్‌లో పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులు మందకొడిగా కొనసాగుతున్నాయి.


పనులు కొనసాగుతున్నాయి

అమృత్ పథకం కింద జిల్లాలో వాటర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సాంకేతిక సమస్యలతో ఒకటి రెండు చోట్ల పనులు నిలిచిపోయాయి. వాటిని కూడా త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తాం. ప్రారంభించిన పనులు ఎక్కడైనా నిలిచిపోతే వాటిని గుర్తించి వెంటనే పూర్తి చేయిస్తాం. – మనోహర, డీఈ, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్

- మోత్కూర్ మున్సిపాలిటీకి రూ.12 కోట్లు మంజూరయ్యాయి. 800 కేఎల్ సామర్థ్యంతో జూనియర్ కాలేజీలో నిర్మించతలపెట్టిన ట్యాంకు పనులు శంకుస్థాపన అనంతరం పునాదులకే పరిమితమయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 600 కేఎల్ సామర్థ్యంతో చేపట్టిన వాటర్ ట్యాంక్ పిల్లర్ల దశలో నిలిచిపోయింది. 12 కిలోమీటర్ల దూరం పైపులైన్ వేయాల్సి ఉంది.
- చౌటుప్పల్ మున్సిపాలిటీకి రూ.20 కోట్లు మంజూరయ్యాయి. చౌటుప్పల్, తాళ్లసింగారం, లక్కారం గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో, తంగడపల్లిలో నిర్మించే ట్యాంకులు ఒక్కొక్కటి 7.50 లక్షల కెపాసిటీ ఉండగా, మిగతావి 5 లక్షల కెపాసిటీ ఉన్నాయి. నెల రోజుల క్రితమే పనులు ప్రారంభంకాగా నత్తనడకన సాగుతున్నాయి.

రేషన్ బియ్యం తరలిస్తున్న ముఠా అరెస్ట్

- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అంతర్ రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర రాజు విలేకరులకు వెల్లడించారు. అక్టోబర్ 24వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన కొంతమంది అమాయక కూలీలను వాహనంలో తీసుకొచ్చి దామరచర్ల మండలంలోని బాండావత్ తండాలో రేషన్ బియ్యం బస్తాలను లోడు చేసి తిరిగి వెళ్తుండగా.. దామరచర్ల శివారులో నర్సాపురం ఎక్స్ రోడ్డు వద్ద అర్ధరాత్రి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొందరు కూలీలకు తీవ్ర గాయాలు కాగా.. షేక్ నాగులు అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అప్రమత్తమైన అక్రమ దందాగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా గాయపడిన కూలీలను అక్కడి నుంచి ఆంధ్రాకు తరలించారు. షేక్ నాగులు మృతదేహాన్ని కూడా అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. బియ్యం బస్తాలను మాయం చేశారు. మరుసటి రోజు ఘటన జరిగిన ప్రదేశంలో రక్తం మరకలు ఉండటం.. రేషన్ బియ్యం పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి.. ప్రమాదానికి గురైన వాహనాన్ని గుర్తించారు. వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నిందితుల గురించి తెలిసింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన మందపాటి నరసింహారావు, కల్లూరి లింగయ్యను మంగళవారం పోలీసులు గుర్తించి మిర్యాలగూడలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. అరెస్టయిన వారిపై గతంలో ఎనిమిది కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

అడవిదేవులపల్లిలో ఒకరు అరెస్ట్..

అదేవిధంగా అడవిదేవులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి ఆంధ్రాకు తరలిస్తున్న పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన తిప్పబత్తుల వెంకటనారాయణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రాజశేఖర రాజు తెలిపారు. ఆంధ్రాకు చెందిన ఆంగోతు రాంబాబు, పెంటబోయిన సైదారావుతో కలిసి వెంకటనారాయణ రేషన్ బియ్యం దందా చేస్తున్నట్లు తెలిపారు. అతడి నుంచి 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, అడవిదేవులపల్లి ఎస్‌ఐ శేఖర్ తదితరులున్నారు.